# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 15-08-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **"ఆపరేషన్ సిందూర్" ఆత్మనిర్భర్ భారత్ కు ప్రతీకగా నిలిచిందని రాష్ట్రపతి ద్రౌపది ముర్మ్ము ఉద్ఘాటించారు.**
2. **79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి, ఉభయ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు.**
3. **సమర్థ నీటి నిర్వహణతో కరవు పరిస్థితులను ఎదుర్కోవచ్చని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు.**
4. **థర్మల్ పవర్ స్టేషన్స్‌కు అవసరమైన యంత్రాలు, వాటి మరమ్మతులకు ఏపీహెచ్ఎమ్ఈఎల్ ఉపయోగపడుతోందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు.**
5. **మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై విద్యాసంస్థల్లో అవగాహన కల్పిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ హోం శాఖ మంత్రి వి. అనిత తెలిపారు.**

=========================

"ఆపరేషన్ సిందూర్" ఆత్మనిర్భర్ భారత్ కు ప్రతీకగా నిలిచిందని రాష్ట్రపతి ద్రౌపది ముర్మ్ము పేర్కొన్నారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గత సాయంత్రం రాష్ట్రపతి జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. దేశ రక్షణ భద్రతా అవసరాలను తీర్చడంలో స్వయం సమృద్ధి సాధించే స్థాయికి భారత్ చేరుకుందని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి భారతదేశ రక్షణ చరిత్రలో ఆపరేషన్ సిందూర్ గొప్ప మైలురాయి అని రాష్ట్రపతి తెలియజేస్తూ,

వాయిస్ 30 సెకన్లు

--------------------------

ఢిల్లీలోని ఎర్రకోటలో 79 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరగనున్నాయి. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ మరికొద్ది సేపట్లో జాతీయ జెండాను ఆవిష్కరించి జాతిని ఉద్దేశించి ప్రసంగిస్తారు. 2047 నాటికి ప్రభుత్వ లక్ష్యమైన వికసిత్ భారత్ దార్శనికతను సాకారం చేసుకునేలా " నయా భారత్" ఇతివృత్తంతో ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరుగుతున్నాయి. ఎర్రకోటలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు వివిధ రంగాల నుండి సుమారు ఐదు వేల మంది ప్రత్యేక అతిథులను ఆహ్వానించారు. వీరిలో 2025 ఒలింపిక్స్ భారత బృందం, అంతర్జాతీయ క్రీడా కార్యక్రమాల విజేతలు, ఖేలో ఇండియా పారా గేమ్స్‌లో బంగారు పతక విజేతలు

ఉన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు చెందిన విద్యార్థులు, రైతులతో వివిధ రంగాలకు చెందిన పలువురు ఈ వేడుకల్లో పాల్గొంటున్నారు.

---------------------------

భారత దేశ 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్, తెలంగాణా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ఉభయ రాష్ట్రాల ముఖ్య మంత్రులు నారా చంద్రబాబు నాయుడు ఎ. రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. దేశ స్వాతంత్ర్యం కోసం కృషి చేసిన మహనీయుల ధైర్య సాహసాలను స్మరించుకుంటూ వారికి నివాళులర్పించాలని వారి సందేశాలలో పేర్కొన్నారు.

---------------------------

ఉభయ తెలుగు రాష్ట్రాలలో 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు అధికారులు పూర్తి చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్.టి.ఆర్.జిల్లా విజయవాడ నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ మైదానంలో ఈ ఉదయం అధికారికంగా జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొంటుండగా తెలంగాణా రాష్ట్రంలోని హైదరాబాదు గోల్కొండ కోటలో జరిగే వేడుకలలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పాల్గొంటారు.

---------------------------

సమర్థ నీటి నిర్వహణతో కరవు పరిస్థితులను ఎదుర్కొవచ్చని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయం నుంచి సాగు నీటి సంఘాలు, జిల్లా కలెక్టర్లు, అధికారులతో ముఖ్యమంత్రి నిన్న దృశ్య మాధ్యమ విధానంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నీటి నిర్వహణ, చివరి భూములకు నీరందించడం, సమర్థ నీటి వినియోగం వంటి అంశాలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, నీటి వనరులను పూర్తి స్థాయిలో సంరక్షించిన్పపుడే భూగర్భజలాలు పెరుగుతాయని అన్నారు. రాష్ట్రంలోని ప్రతి ప్రాంతంలోని చివరి ఆయకట్టు వరకు నీరు చేరేలా నీటి నిర్వహణ చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు.

---------------------------

బుడమేరు వాగు సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని చేపడతామని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ అన్నారు. విజయవాడ అజిత్ సింగ్ నగర్‌లో బుడమేరు వంతెనను స్థానిక శాసనసభ్యులు బొండా ఉ మామహేశ్వర రావుతో కలిసి ఆయన నిన్న పరిశీలించారు. అనంతరం శివనాథ్ మాట్లాడుతూ,

వాయిస్..25 సెకన్లు

---------------------------

థర్మల్ పవర్ స్టేషన్స్ కు అవసరమైన యంత్రాలు, వాటి మరమ్మతులకు ఆంధ్రప్రదేశ్ హెవీ మిషనరీ ఇంజనీరింగ్ లిమిటెడ్ – ఏపీహెచ్ఎమ్ఈఎల్ ఉపయోగపడుతోందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో సింగరేణి అనుబంధ సంస్థ ఏపీహెచ్ఎమ్ఈఎల్‌ను ఆయన నిన్న సందర్శించి అక్కడి కార్మికులతో సంభాషించారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ, కొత్త పరిశ్రమల విడిభాగాల తయారీతో పాటు, పాత విడిభాగాలను మరమ్మతు చేసి సరఫరా

చేస్తున్న సంస్థ ఏపీహెచ్ఎమ్ఈఎల్ అని తెలిపారు. కర్మాగారాల్లో పనిచేసే సిబ్బంది తప్పకుండా భద్రతా చర్యలు పాటించాలని ఉపముఖ్యమంత్రి సూచించారు.

---------------------------

మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై విద్యాసంస్థల్లో అవగహన కల్పిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ హెూం శాఖ మంత్రి వి. అనిత తెలిపారు. విజయనగరంలోని కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా సమీక్షా సమావేశంలో మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మాదక ద్రవ్యాలు శారీక, మానసిక ఆరోగ్యాలపై తీవ్ర దుష్ ప్రభావాలు కలుగజేస్తాయని పేర్కొన్నారు. వీటి నివారణకు రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని మంత్రి సూచించారు. పాఠశాల, కళాశాలల్లో ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972 ను ప్రదర్శించాలని అధికారులను ఆమె ఆదేశించారు.

---------------------------

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన అధికారులకు కేంద్ర ప్రభుత్వం పతకాలను ప్రకటించింది. వీటిలో ఆంధ్రప్రదేశ్‌కు రెండు రాష్ట్రపతి పతకాలు, 20 మెరిటోరియస్ సేవా పతకాలు లభించాయి. ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లాలోని చినగంజాం గ్రామానికి చెందిన కె.రాజగోపాల్‌రెడ్డి, జి.మధుసూదనరావులను ప్రెసిడెంట్ మెడల్స్ వరించాయి. అలాగే తెలంగాణకు ఒక గ్యాలంటరీ, రెండు రాష్ట్రపతి పతకాలు, 11 మెరిటోరియస్ సేవా పతకాలను కేంద్రం ప్రభుత్వం ప్రకటించింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని వేర్వేరు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో విద్యుత్ శాఖపై నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తక్కువ వ్యయంతో విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ చేసినప్పుడే వినియోగదారులకు ప్రయోజనం కలుగుతుందని స్పష్టం చేశారు. గత ఏడాది విద్యుత్ కొనుగోళ్లు, వచ్చే ఏడాది అవసరాల అంచనాలను విశ్లేషించి, మార్కెట్ కొనుగోళ్లను సమర్థవంతంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి సూచించారు.

---------------------------

భారత స్వాతంత్ర్య సమర యోధులను స్మరించుకుంటూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల్లోని ప్రజలు హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. పాఠశాలల విద్యార్థులు, ఉపాద్యాయులు, యువకులు, మహిళలు పెద్ద ఎత్తున త్రివర్ణ పతాకాలు చేతబూని ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. మరొక వైపు ... వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రభుత్వ ..., ప్రైవేటు ఉద్యోగులు, ఇతరులు తమ తమ కార్యాలయాలు, ఇళ్లపై హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా జాతీయ పతాకాలను ఎగుర వేస్తున్నారు.

---------------------------

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం.. పశ్చిమ దిశగా కదులుతూ.. ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిషా వైపు ప్రయాణించే అవకాశముందని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రానున్న 5 రోజులపాటు ఉత్తరాంధ్రతో పాటు దక్షిణ కోస్తా జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి జగన్నాథ కుమార్ తెలియజేస్తూ,

వాయిస్ ..35 సెకన్లు

మరోవైపు తెలంగాణలో ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఈరోజు, రేపు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉత్తర తెలంగాణా జిల్లాకు ఆరెంజ్ అలర్ట్‌ను జారీ చేసింది.

======================